# కైవాని

"త్రాతయ్యా! తాతయ్యా! ఒకకథ చెప్పవూ" అని అడిగాను నేను.

మామూలుచోటే – సుబ్బయ్యగారి రత్తయ్య అరుగులమీద కూచుని ఉన్నాం. రాత్రి పదవుతుంది. ఊళ్ళోఅంతా తలుపులు మూసుకున్నారు. ఎక్కడా అలికిడి లేదు. ప్రొద్దుపోని కుర్రకారంతా తాతయ్యా చుట్టూ చేరాం. పైపంచె నడుముకూ, మోకాళ్ళకూ బందంలాగాచుట్టి, తాతయ్యా తాపీగా చుట్ట కాలుస్తున్నాడు.

"ఇప్పుడేంకథలే పోనిద్దూ!''

'తాతయ్యా– తాతయ్యా'

'తాతయ్యా నువ్వు నీ నులకమంచాలు ఊడదీసి పెట్టావే. రేపు వాటిని నెయ్యటానికి నా సాయం అక్కరలేదా?" అని అడిగాడు శంకరాయి.

"అయినా చెప్పటానికి కథ లేమి ఏడిసినయ్ గనుక. రాజులూ, రాణీలు ఉన్నకథలు చెపితే రాజకీయాల వాసన రావొచ్చు అందులో ఈమధ్యే కొత్త చట్టా లేవో వచ్చినయ్యంట, నీతికథలు చెపుదామంటే మీకు తెలియని నీతు లేమున్నయ్. అయినా అలాంటి కథలు మీరు చిన్నతనంనుంచీ ఎన్నో చదివి ఉంటారు దేవతలు రాక్షసులు భూతాలు ప్రేతాలు పిశాచాలు వచ్చే కథలు చెప్పదామంటే మీ కాలువాళ్ళకు వాటిలో నమ్మకం లేదాయె. రాగా పోగా మిగిలింది ప్రేమ ఒకటి. ఏ గొడవా లేనిది."

"పర్వాలేదులే తాతయ్యా, ప్రేమకథే చెప్పు ఎవడూ వద్దనడులే!" అన్నాడు రాముడు. ఆ వెధవాయి ఈ మధ్య ప్రేమ మీద పరిశోధన సాగిస్తున్నాడులెండి.

"దాంట్లో గూడా ఎన్ని చిక్కులు ఏడిసినయ్యి, మన రంగాయో ఎవడో చెప్పాడు–ఈమధ్య కొంతమంది కథలు రాసేవాళ్ళు ఏంరాయాలో తోచక, తమ స్నేహితులు, బంధువులు, పరిచయస్తులు అయినవాళ్ళ సంగతులే కథల్లో ఎక్కించేస్తున్నారట. వీళ్ళదెబ్బకు తట్టుకోలేక కథలు రాసేవాడంటే సరి, మైలుదూరం నుంచి పారిపోతున్నారట ప్రజలంతా. ఇలాంటి కథలద్వారా తమ జీవితాలు రచ్చకెక్కేసరికి కొంతమంది ఆత్మ

హత్యలుకూడా చేసుకున్నారట. అందు వల్ల అబ్బాయిలూ!...''

'నీతో అలాంటి భయం లేదులే తాతయ్యా! నువ్వు గొప్ప భావనాశక్తి గలవాడివి..."

"అంటే..."

"అంటే నువ్వు లేనిపోనివన్నీ కల్పించి చెప్పగలవన్నమాట" అని వ్యాఖ్యానం చేశాడు శంకరాయి.

"అంటే నేను వట్టి అబద్ధాల కోరునని మీ ఉద్దేశమన్నమాట. ఇదిగో అబ్బాయి! నేను ఇంతవరకూ నాజన్మలో ఎన్నడూ అబద్ధమాడి ఎరుగను— ఎగతాళిక్కూడా. నేను మీకు కథలు చెబుతున్నానంటే నా జీవితంలో జరిగిన విషయాలే పేరులవీ మార్చి కథలుగా అల్లి చెబుతున్నానన్నమాట. అయితే ఒక్కటీ కూడా అబద్ధంకాదు. నాకసలు అబద్ధాలు చెప్పటంలో నమ్మకంలేదు" అన్నాడు తాతయ్య.

"దానికేం తాతయ్యా. నువ్వు కథ మొదలుపెడుదూ. ఒరే యిక నోళ్ళు మూయండిరా!" అన్నాడు రాముడు. అందరం నోళ్ళు మూశాం.

"ఆరోజుల్లో నేనొక ఓడల కంపెనీలో పనిచేస్తూ ఉండేవాణ్ణి. మా ఓడలు దక్షిణ పూర్వంలో ఉన్న దీవులకు పోయి తిరిగి వస్తూండేవి ఏలకులు, లవంగాలు, మసాలా దినుసులు మొదలైనవి కొని జేరవేస్తూ ఉండేది మాకంపెనీ. అది తెల్లవాళ్ళది. మా ఓడ కప్తానుకూడా తెల్లవాడే. చాలా మంచివాడు. నేనంటే ఇష్టంగా ఉండేవాడు. ఒకసారి...''

"ఆకంపెనీ పేరేమిటి తాతయ్యా-'' అని అడిగాడు శంకరాయి.

"ఒరేయి కంపెనీ పేరు ఏదయితే నీకెందుకురా? నీకు కథ కావాలా, ఓడల కంపెనీలపేరుల జాబితా కావాలా? ఇలాంటి కుంటిప్రశ్నలు వేశారంటే కథ చెప్పటం మానేస్తాను. మీరు పత్రికల్లో, పుస్తకాల్లో ఇన్ని కథలు చదువుతున్నారు వాళ్ళందరినీ ఇలాంటి ప్రశ్నలు అడుగుతున్నారా? ఏం, నేను లోకువగా దొరికాననా?" అన్నాడు తాతయ్య.

"లేదులే తాతయ్య. నువ్వుకథచెప్పు. ఇక ప్రశ్నలువేస్తే ఒట్టే.'' అన్నాను నేను.

"అలా రండి దోవకు- ఎక్కడ వున్నానూ, ఆఁ. ఒకసారి ఏంజరిగిందంటే మేం నడిసముద్రంలోఉండగా పెద్ద తుఫాను వచ్చింది. ఓడపని మునగటం తేలటంగా ఉంది. తాటిఎత్తున లేచిన కెరటాలు ఓడమీద విరుచుకుపడుతున్నాయి జీవితమంతా సముద్రంమీద గడిపిన కప్తానుకూడా ఆలోచనలో పడిపోయాడు. సముద్రం ప్రళయరూపం దాల్చింది. 'డెక్'మీద ఉన్న మాకు కాళ్ళు నిలవటం లేదు. ఒక్కొక్క కెరటం వచ్చి పడిందంటే దాని తాకిడికి ఓడ అంచువరకూ కొట్టుకు పోతున్నాం. ఎలాగో త్రాళ్ళు

కట్టుకుని, ప్రమాదంలో పడిపోకుండా ప్రాణాలు కాపాడుకొంటున్నాము. అందులో కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి. మా గ్రుడ్డి లాంతర్లు ఎపుడో ఆరిపోయాయి. కెరటాల తలలమీద కిరీటాల్లా మెరుస్తున్న నురుగు తప్ప ఏమీ కనుపించటం లేదు.


"ఇంతలో ఒక బ్రహ్మాండమైన కెరటం వచ్చిపడింది. అల్లంతదూరంలో దాన్ని చూడగానే మా గుండెల్లో దడ బయలుదేరింది. కాళ్ళూ చేతులూ ఆడలేదు. 'వస్తోంది, జాగర్త' అని ఒకరి నొకరం హెచ్చరించుకున్నాం. ఇంతలో రానే వచ్చింది. ఆ నిమిషంలో ఏం జరుగుతుందో నా క ర్థం కా లే దు. ఏవో కేకలుమాత్రం వినిపించాయి. ఏదో ఒక మహత్తరశక్తి నన్ను పసిపిల్లవాణ్ణి చేసి ఎత్తుకపోతున్నట్టు తోచింది. ఏం జరిగిందో గ్రహించే టప్పటికే నేను మహాసముద్రంలో ఉన్నాను.

"అప్పటికే ఓడ నాకు దూరమైపోయింది. కప్తాను గదిలో దీపం మిణుగురు పురుగులా మెరుస్తోంది. ఈ తుఫానులో నన్ను రక్షించటం సంగతి అలా ఉంచి వాళ్ళను వాళ్ళు రక్షించుకుంటే చాలు. నా దురదృష్టాన్ని తిట్టుకోవటం తప్ప నేను చేయగలిగిం దేమీ కనుపించలేదు. మనిషి బొందెలో శ్వాస ఉన్నంతవరకూ ఆశ చావదు. బిగ్గరగా అరవాలని ప్రయత్నించాను. ఎలాగో ఈది ఓడను చేరుకోవాలని పోరాడాను. ఫలితం మాత్రం కనుపించలేదు. అలసి సొలసి స్పృహతప్పిపోయాను.

"నాకు మళ్ళీ స్పృహ వచ్చి కళ్ళు తెరిచి చూసేటప్పటికి ఇసుకలో పడి వున్నాను. నా కళ్ళకు ఎదురుగా కనిపించినది ఒక నల్లని ముఖం. ఆ ముఖంలో సంతోషం వుద్రేకం రెండూ కనిపిస్తున్నాయి. అతను అరుస్తూ ఏదో చెబుతున్నాడు. కాని, అతని భాష నాకు అర్థం కావడం లేదు. ప్రళయంలాగ వచ్చిన తుఫాను నన్ను ఏదో ఎరుగని దీవిలో తెచ్చిపడేసిందని అప్పుడు గ్రహించాను. అతన్ని ఏవో ప్రశ్నలు అడగబోయాను. అతడు సైగలతో "నిన్ను నేను రక్షించి తీసుకు వచ్చాను" అని చెప్పాడు.

"తన రొమ్ము చరిచి, 'కిమాని,కిమాని' అన్నాడు. దాన్నిబట్టి అతని పేరు 'కిమాని' అని గ్రహించాను. నేను కూడా మెల్లగా రొమ్మును తాకుతూ 'రామయ' అన్నాను. అతను చప్పట్లు చరిచి 'రామ, రామ' అని గంతులు వేయసాగాడు. నన్ను లేవదీసి మెల్లగా నడిపించుకుంటూ తీసుకువెళ్ళాడు. ఆ ప్రశాంత మహాసాగరంలో నే నెరుగని ఒక చిన్న దీవి. అక్కడి ప్రజలు చూడడానికి మంగోలు జాతికి దగ్గరగా వున్నారు. కాని, వాళ్ళు యింకా పొడుగ్గా, నల్లగా, దృఢంగా వున్నారు. వాళ్ళంతా నన్ను గురించి, కుతూహలం కనబరచారు. కాని, ఏ విధమైన అయిష్టత





కాని, పరాయివాడి ననే ఏవగింపుగాని వారి ప్రవర్తనలో కనుపించలేదు. కొద్ది రోజుల్లోనే వారు నన్ను తమలో ఒకణ్ణిగా స్వీకరించారు.

"కిమానీ నన్ను వాళ్ళ రాజుదగ్గరకు కూడా తీసుకువెళ్లాడు. వాళ్ళ రాచమర్యాద అదీ నేర్పి-నన్ను రాజుకు నమస్కరించమన్నాడు. నన్ను గురించి రాజుకు ఏదో చెప్పాడు. రాజు చిరునవ్వు నవ్వి తల ఊపాడు. నేను చాలా మంచివాడి ననీ, నా వల్ల ఆదీవి ప్రజలకు ఏవిధమైన కీడూ రాదని హామీ ఇచ్చి నన్ను తనతోనే ఉంచుకుంటా నని కిమానీ చెప్పాడట. ఇది నాకు తర్వాత తెలిసింది. రాజు ప్రక్కన ఎవరో ఒక పడుచు ఉన్నది.

ఆమెవంక చూపించి కిమానీ ఏదో చెప్పాడు. రాణీ ఏమో ననుకున్నాను. ఆమెకూడా చిరునవ్వు నవ్వింది. ఆమె రాణీ కాదనీ, రాజకుమారి రీతా అనీ తర్వాత తెలిసింది.

"ఆ దీవి ప్రజలను చూస్తే నాకు కొంచెం ఆశ్చర్య మేసింది. ఎందుకంటే– వారు చూడడానికి అనాగరికులుగా వున్నా. అతిథి మర్యాదలో గాని, సంఘపు కట్టుబాట్లను పాటించడంలో గాని, ఒకరి నొకరు గౌరవించుకొనడంలో గాని నాగరికుల కంటే మిన్నగా వున్నారు.

"నాకూ కిమానీకి మంచి స్నేహం కుదిరింది. అతడు నా ప్రాణాలు రక్షించాడనే కాదు; అతని స్వభావంలోనే యిట్టే స్నేహం కలుపుకునే గుణం వుంది. అతని దేహం ఎంత నల్లటిదో మనస్సు అంత తెల్లటిది. చాలా బలశాలి.

"సంతోషంగా వున్నప్పుడు గట్టిగా నా వీపుమీద చరిచి నన్ను పిల్లవాణ్ణి ఎత్తుకున్నట్లు ఎత్తుకుని అల్లిబిల్లి తిప్పేవాడు ఆ దీవిలోవున్న చిన్నలు, పెద్దలు అంతా అతన్ని చాలా గౌరవించేవాళ్ళు. సాటి పడుచు వాళ్ళు అతన్ని చూసి అసూయపడే వాళ్ళు. ఆ దీవిలోని పడుచులు అతన్ని ఎంతో ఆశగా చూస్తు వుండేవాళ్ళు నలుగు రైదుగురు పడుచులు కలిసి సముద్రపు ఒడ్డుకు గాని, చెట్ల గుబురులోకి గాని జట్టుగా వెడుతున్నప్పుడు కిమానీ ఎదురుపడితే ఒకళ్ళ నొకళ్ళు మోచేతుల్తో పొడుచుకోవడం, నవ్వుతూ అతనివంక చూడడం నేను స్వయంగా చూశాను. కిమానీ వాళ్ళ దృష్టిలో వొట్టి అందగాడే కాదు, గొప్ప వీరుడుకూడా. బల్లెంతో పెద్దపెద్ద చేపలను చంపడంలో గాని, తెప్పను నడపడంలో గాని, వేటాడడంలో గాని, అతన్ని మించినవాళ్ళు ఆ దీవిలోనే లేరని నాకు తెలిసింది. కాని, పాపం కిమానీ అందమైన ఆడపిల్లలకు అందరాని పండయి పోయాడు. ఎందువల్లనంటే – కిమానీ రాజుకూతురు రీతాని ప్రేమించాడని. ఆ అమ్మాయికి కూడా అత నంటే యిష్టం మరి. భాష తెలియక పోవటంవల్ల ఇది నేను ఆమెను మొదట చూసిన రోజున గ్రహించలేక పోయాను.

"కిమానీ చాలా సిగ్గరి. ఆడపిల్లలు అతనికి వినబడేటట్లు వేళాకోళా లాడినా అత నేమీ జవాబు చెప్పేవాడు కాదు. వాళ్ళ సంగ తేమీ పట్టించుకోకుండా వెళ్ళి పోతుండేవాడు. పడుచుదనంలో సహజంగావుండే చిలిపితనంగాని, ఆటకాయితనంగాని అతనిలో నాకు కనుపించలేదు. వయస్సు ఎక్కువ లేకపోయినా అతడు చాలా గంభీరమైన మనిషి.

"మెల్లమెల్లగా నేను వాళ్ళలో కలిసి పొయ్యాను. వాళ్ళ అలవాట్లన్నీ అలవరచుకున్నాను. వాళ్ళ భాష కూడా కొంచెం కొంచెంగా నేర్చుకున్నాను.

"ఒకరోజున కిమానీ వచ్చి నాతో

'వెడదాం పద' అన్నాడు. 'ఎక్కడికి' అన్నాను. 'చెబుతా పద' అన్నాడు, అతని వెంట నడిచాను. కొంతదూరం వెళ్ళాక అర్థం అయింది నాకు—అతను నన్ను రాజువద్దకు తీసుకెడుతున్నాడని.

'పదు, నే దేనికి?' అన్నాను.

'బలే నాడివే. రీతా నిన్ను చూడాలన్నది' అని నా చెయ్యి పట్టుకుని లాక్కెళ్ళాడు.

"మొదటిసారి రాజు ప్రక్కన చూసినప్పుడు, భయంవల్లగానీ, బెదురువల్లగానీ ఆమెను సరిగా చూడలేదు. ఇవాళ చూశాను. అసలా దేశపు స్త్రీలు చాలా అందమైనవాళ్ళు. నల్లగా ఉంటేనేం, చెక్కిన విగ్రహాల్లా ఉన్నారు అందులో రాజకుమార్తె మరీన్నీ—శరీరకష్టం చేసే వాళ్ళలోగాని ఆ అందం కనబడదు. ఆ ఒంపులూ, ఆ కండలూ..."

"ఇక సర్లే-చలంగారి వర్ణనలు మొదలు పెట్టాడు తాతయ్య" అన్నాడు రాముడు.

"చలం ఎవరో! ఆమె పేరు రీతా" అన్నాడు తాతయ్య.

"లేదులే తాతయ్యా. నువ్వు కథ చెప్పు!" అన్నాను.

"అయితే ఆమెకూ, ఆ దీవిలోని యితర పడుచులకూ కట్టులోగాని, బొట్టులోగాని నాకేమీ తేడా కనిపించలేదు. ప్రవర్తనలో మాత్రం తేడా వున్నది. ఆమె చూపులూ, మాటలూ, మర్యాదలూ హుందాగా వున్నాయి. నేను పరాయిజాతివాణ్ణయినా, నా వంక విచిత్రమైన జంతువును చూసినట్టుగా చూడలేదామె. ఆమెలో వెకిలితనమనే దెక్కడా లేదు.

'కిమానిని నాకు దూరం చేశావు— అన్నది. రాకుమారి.

నేను గాబరాపడి 'అదేంటి అలా అంటారు' అని క్షమాపణ చెప్పబోయాను.

'నీ వంటి మంచి స్నేహితుడు దొరికే టప్పటికి కిమానీ నన్నుకూడా మరచి పోయాడు' అన్నది ఆమె-నాకు నెమ్మది కలిగింది.

'సెలవు తీసుకుని తిరిగి వచ్చేటప్పుడు రాజుకు ఆమె అంటే ప్రాణమనీ, ఆమె ఏమి కోరినా కాదనడనీ చెప్పాడు కిమానీ.

"ఆ రోజునుంచి రీతావద్దకు ఎప్పుడు వెళ్ళినా కిమానీ నన్ను కూడా తీసుకెళ్ళే వాడు. సముద్రపు ఒడ్డుకు వెళ్ళినా, వనంలో పళ్ళు కోసుకోవడానికి పోయినా మేం ముగ్గురం కలిసి వెళ్ళేవాళ్ళం.

"ఆ దీవిలో స్త్రీలకు స్వేచ్ఛ ఎక్కువ. స్త్రీలూ, పురుషులూ జంటలు జంటలుగా కలిసి తిరుగుతూ ఉండేవారు. పెద్దలెవ్వరికీ అభ్యంతరం ఉండేదికాదు. సంఘంలో ఎక్కువతక్కువలూ అంతస్తుల తేడా కూడా ఉన్నట్టు కనుపించలేదు.

"కిమానీ నన్ను సోదరునిలా చూసే వాడు. రాకుమారితో కులాసాగా తిరుగుతూ ఉంటే నేను పానకంలో పుడకలా వున్నాననే భావం అతనిలో ఏ కోశానా కను

...ంచలేదు. ముగ్గురం కలిసి తిరుగుతున్నప్పుడు రాకుమారి ఒక్కొక్కరోజు అతనిలాగానే నా బుజంమీదకూడా చేయి వేశేది. మరోసారి నన్ను నవ్వుతూ కవ్వించేది. అతను ఈర్ష్య పడినట్లు ఎప్పుడూ తోచలేదు. ప్రేమను సంపూర్ణంగా స్వాయత్తం చేసుకున్న ధీరవాసా కనపరచేవాడు. ఒకరోజున హఠాత్తుగా కిలకిలా నవ్వే రాకుమారిని గాలిలో మెలాగ్గా ఎత్తేశాడు అంత బలిష్ఠమైన రాకుమారి గాలిలో సీతాకోకచిలుకలాగా అలా కాళ్ళూ చేతులూ ఆడిస్తూ ఉండిపోయింది. క్రిందకు దించి 'నువ్వెత్తుకో చూదాం' అన్నాడు. నాకు ముచ్చెమటలు పట్టాయి. 'ఊ, కానీ!' అన్నాడు. రాకుమారి చేతులు చాచింది. నాగరికతలోంచి వెళ్ళినవాడికి నా రా స్వచ్ఛతా, స్వాచ్ఛందతా ఎక్కడినుంచి వస్తాయి! ప్రయత్నించాను. నాకు కళ్ళు బయర్లు కమ్మినట్టయింది. రాకుమారి కూడా ముడుముకుని అలా వాలిపోయింది. క్రిందకు దించేశాను. 'చూశావా, నీవల్ల కాలేదు' అన్నాడు కిమానీ నవ్వుతూ. నేను సిగ్గుతో తల వంచుకున్నాను.


"అప్పటినుంచి నాలో ఏవదో దొంగ ప్రవేశించినట్లయింది. రాకుమారిని కన్నెత్తి చూడాలన్నా తాకాలన్నా బెమరుగా ఉండేది. రాకుమారి మామూలుగానే నవ్వుతూ మాట్లాడుతూ ఉండేది. కాని ఆమెలోకూడా ఏదో మార్పు ఉందని అనిపించేది నాకు. ఆమె నన్ను తాకినప్పుడు ఆ స్పర్శ పూర్వంలా ఉన్నట్లనిపించేది కాదు. ఆమె నా వంక చూసినప్పుడు ఆ కళ్ళు ఎందుకో మెరుస్తున్నట్లు అనిపించేది. అంతా నా భ్రమ అనుకొనేవాడిని.

"ఏవిధమైన మార్పూ లేనివాడు కిమానీ– నాలో మార్పుకూడా అతడు గమనించలేదు. అతణ్ణి చూసినప్పుడు నేను చాలా సిగ్గుపడేవాణ్ణి. నన్ను నేనే తిట్టుకునేవాణ్ణి. ఒక్కొక్కసారి ఈ ఆలోచనలతో రాత్రిళ్లు నిద్రకూడా పట్టేదికాదు. రాకుమారిని తప్పించుకు తిరగాలని నిశ్చయించుకున్నాను. ఏదో సాకు చెప్పేవాణ్ణి. కాని కిమానీ వినలేదు. 'రాకుమారి నీ స్నేహితుడు ఏమయ్యాడని అడుగుతుంది' అని చెప్పి నన్ను బలవంతాన లాక్కుపోయేవాడు.

"మొసలి పట్టుకొని లాక్కుపోయినవానిలా నేనేదో అగాధంలోకి వెళ్ళిపోతున్నానని నాకు తెలుసు. గిజగిజలాడుతున్నాను. కాని లాభంలేకపోతున్నది.

"ఏదన్నా ఓడ రాకపోతుందా అని ఆశగా సముద్రంవంక చూసేవాణ్ణి; భగవంతుణ్ణి ప్రార్థించేవాణ్ణి; కాని దిక్కుల కవాటాలు మూసేఉన్నాయి. ముక్తికి మార్గం కనుపించలేదు. మరణశిక్ష విధించబడినవానిలా నేను రోజులు లెక్కపెట్టనాగాను.

"నేనేదో దిగులుగా ఉన్నానని కిమానీ




"తన కున్న కొద్ది టైంలోనే అందరికీ కొలతలు తీసికోవాలి మరి."

గమనించాడు. 'ఒంట్లో బాగాలేదా ? ఇంటి మీద గాలి మరలిందా ?' అని అడిగాడు. నేనెందుకు అలా ఉన్నానో రాకుమారి కూడా అర్థం కాలేదు.

'నీ స్నేహితుడికి ఇక్కడ బాగా లేదా ? మనం అతిథి మర్యాదల్లో ఏమన్నా లోపంచేశామా ?' అని అడిగింది కిమానీని.

'అబ్బే! ఏమీ లేదని బుకాయించాను.

'కొద్దిగా ఓపికపట్టు. మా తెప్పతిరణాల వస్తున్నది. ఆ వైభవం చూశావంటే నీ దిగులంతా మరచిపోతావు' అన్నది రాకుమారి.

'తెప్పతిరణాల ఏమిటి,' అని అడిగాను కిమానీని.

'తెప్పలే మాకు జీవనాధారంగదా ? తెప్పలమీద వెళ్ళి చేపలను బల్లాలతో వేటాడి తేనేగాని ఈ దీవిలో ఎవరికీ గడవదు. సంవత్సరానికొక్కసారి పూర్ణిమనాడు ఈ దీవిలోని పడుచువాళ్ళంతా తెప్పల పందెంలో పాల్గొంటారు. గెలిచినవారిని మా రాజు కోరినదిచ్చి సన్మానిస్తాడు. ఆ రోజున మా దీవిలో గొప్ప వైభవంగా ఉంటుంది. ముసలి వాళ్ళూ, రోగులూ, పసిపాపలూ తప్ప ఇళ్ళల్లో ఎవరూ ఉండరు. అంతా కడుపునిండా తిని, త్రాగి వెన్నెల్లో నృత్యం

చేస్తారు. మా దీవి ఆ రోజున స్వర్గమే ననుకో' అన్నాడు.

'నువ్వుకూడా నృత్యం చేయగలవా?' అన్నది రాకుమారి నవ్వుతూ. నన్నేదో చెప్పరాని భయం ఆవహించింది.

"తిరణాల దగ్గిరకొచ్చినకొద్దీ దీవిలో హడావుడి ఎక్కువయింది. ఇంటింటా తినుబండారాలు, పళ్ళూ, ఒకి రకి మైన చెట్టురసంలోంచి కాచే 'కీసా' అనే సారాయి, నిల్వచేయసాగారు. పడుచు వాళ్ళ ఉత్సాహానికి మేరలేదు.

"తిరణాల రెండురోజులు ఉందనగా కిమానీ ముసలితల్లి హఠాత్తుగా జబ్బు పడింది. కిమానీకి ఆమెతప్ప నా అనే వారు లేరు. అతనేవో ఆకుపసరులుతెచ్చి చికిత్స చేసాడు. కాని ఆమె జబ్బు తగ్గ లేదు.

"తిరణాల రోజున కిమానీకి ఇష్టం లేకపోయినా తెప్పల పందానికి వెళ్ళక తప్పలేదు. సాటి పడుచువాళ్ళంతా పాల్గొంటూ ఉంటే, అతను ఇంట్లో కూచుంటే అతనికీ, రాకుమారికీ కూడా నామోషీకాదా! రాకుమారి స్వయంగా వచ్చి అతన్ని తీసుకొనివెళ్ళింది. నన్ను కూడా రమ్మన్నది. కాని నేను వెళ్ళ లేదు కిమానీతల్లికి సేవచేస్తూ కూచు న్నాను.

"దూరాన్నుంచి దీవి ప్రజల హర్ష కోలాహలం వినవస్తున్నది. ముసలమ్మ ఏదో మూలుగుతున్నది. నాకు దూరమై పోయినదేశాలూ ఇళ్లూ జ్ఞాపకంవచ్చాయి. విధి నన్ను ఎక్కడికి తీసుకొనివచ్చింది!

"కిమానీ మధ్యాహ్నానికి గాని తిరిగి రాలేదు. నన్ను చూడగానే 'నేనే గెలి చాను. నేనే గెలిచాను' అని కేకలేశాడు. అతనివెంట రాకుమారి కూడా ఉన్నది. సాయంత్రం ఇద్దరినీ తప్పకుండా నృత్యా నికి రమ్మని చెప్పి వెళ్ళిపోయింది. రాకుమారికీ తనకూ పెళ్ళి స్థిరమైనట్లే ననీ రాజుకూడా ఒప్పుకున్నాడనీ కిమానీ చెప్పాడు. అతనికళ్ళు సంతోషంతో మెరుస్తున్నయ్. తల్లి జబ్బుగా లేకపోతే అతను ఇంకా ఎంతో సంతోషించేవాడు!

"సాయంత్రం అతని తల్లికి పరిచర్య చేయటానికి పక్కింటి ముసలమ్మను ఒప్పించి ఇద్దరమూ నృత్యానికి వెళ్లాము. వెళ్ళక తప్పిందికాదు.

"ఇళ్ళన్నీ ఖాళీగా ఉన్నాయ్. జన మంతా ఒక మైదానంలో చేరారు. వెన్నెల వెలుగులో దివిటీల కాంతి సరిగ్గా కన పడటంలేదు. విందు ఎప్పుడో మొదల యింది. తినేవాళ్ళు తింటున్నారు. త్రాగే వాళ్ళు త్రాగుతున్నారు. మే మక్కడకు వెళ్ళగానే జనమందరికళ్లూ ముఖ్యంగా పడుచుల కళ్ళు కిమానీవైపు తిరిగినయ్. తెప్పల పందెంలో గెలిచినవాడుకదా!

"వెళ్ళగానే ముందు కొయ్యపాత్రలో కీసా అందించారు. రాకుమారి తిను బండారాలును ముందు పెట్టింది. పడుచు పిల్లలంతా ఒక్కొక్కరే వచ్చి కీసా

పాత్రలు తినుబండారాలు అందించి మమ్మల్ని మర్యాద చేసివెళ్తున్నారు.

పైన చంద్రుడు నోరారా నవ్వుతున్నాడు. కీసా వాసన, పడుచుల మెడలోని పూల సువాసన జీవితమనే దేవత ముందు ధూపంలా గుబాళిస్తున్నాయ్. గుడిసెలో మూలుగుతున్న ముసలమ్మనూ, ముసలమ్మను పొంచుకుని కూర్చున్న మృత్యువునూ మేం మరిచిపోవటంలో ఆశ్చర్యమేముంది!

"మృదంగాలు మ్రోగినై—పడుచు వాళ్లు గాలిలో ఎగిరి గంతులు వేసి నృత్యం చేయసాగారు. ఆనందంతో చిందులు త్రొక్కుతున్నవారి పాదాల క్రింద భూమి కంపించసాగింది. ముఖాలు మసక మసకగా కనుపించసాగినై — వారు త్రాగిన కీసా అంతా చెమటగా ప్రవహించసాగింది యువకుల చెమర్చిన మొగాలపైనా, వీపుల పైనా, యువతుల బాహువులపైనా, వారితో బాటే నృత్యం చేస్తున్న పాలిండ్ల పైనా, పాముల్లా వ్రేలాడుతున్న పూలహారాలపైనా, వెన్నెల తళతళా ప్రకాశిస్తున్నది. అలసిపోయినవారు వస్తున్నారు. మళ్ళీ కీసా త్రాగి నృత్యానికి వెళ్ళుతున్నారు. నృత్యంచేస్తున్న వాళ్ళ ఉత్సాహం కనుపించని వాళ్ళలాగా కూర్చుని చూస్తున్న వాళ్ళనుకూడా కట్టి వేసింది.

"నేను కల కంటున్నట్లుగా, అలాగే చూస్తూ కూర్చున్నాను. ఒడ్డున కూర్చుని ఒక భయంకరమైన ప్రవాహాన్ని చూస్తున్నవాడిలా ఉంది నా పని. కళ్ళుతిరిగినంత పనయింది

"కిమాసీకి తీరిక లేదు. యువతులంతా అతనివెంట పడుతున్నారు తమతో నృత్యంచేయమని. అతనికి వీలైనప్పుడల్లా రాకుమారితోనే నృత్యం చేస్తున్నాడు. కాని మిగిలిన పడుచులను తప్పించుకోలేక పోతున్నాడు.

"రాకుమారి కళ్ళు మెరుస్తున్నవి. ఆమె శరీరం అంతా పూవులా విరుస్తున్నట్టుగా ఉంది. వెన్నెల ఆమె దేహంలో ప్రవేశించి లోపలినుంచి బయటకు కాంతులు విరజిమ్ముతున్నట్టుగా ఉంది. నృత్యంచేస్తూ మధ్యమధ్య నాకేసి చేయి ఊపుతున్నది.

"ఇంతలోకి ఒక కుర్రవాడు పరుగెత్తుకుంటూ వచ్చాడు. కిమాసీని పిలిచి వాళ్ళమ్మ చావుబతుకుల్లో ఉందని చెప్పాడు. కిమాసీ చెమటతుడుచుకుంటూ రాకుమారికి సంగతి చెప్పాడు. నేను కూడా లేవటం చూసి నన్ను రాకుమారికి తోడు ఉండమని చెప్పి వెళ్ళిపోయాడు.

"మృదంగాలు క్రొత్త ఊపిరి పోసుకున్నట్టు మ్రోగసాగినై. నృత్యం స్థాయి నందుకున్నది. రాకుమారి చుట్టూ కలయ చూచి నా వద్దకు వచ్చింది. చేతులు చాచి 'నృత్యం చేదాం రమ్మ'న్నది. నా గుండెలు మృదంగాలలాగే మ్రోగసాగినై. నేను వెనుకాడాను. 'రా' అన్నది నిసుగ్గా.

నా ప్రక్కనున్న ఇద్దరు ముగ్గురు 'పోవేం' అన్నారు. ప్రవాహంలో దూకాను.

"మృదంగాలు మ్రోగుతూనే ఉన్నాయి. వెన్నెల తళతళా మెరుస్తూనే ఉంది. నా రుధిరం కీసా వాసనకన్నా ఎక్కువ మత్తెక్కింది. పూలవాసన, పూలను మించిన పడుచుదనపు సువాసన. గాలిలో తేలుతున్న కీసావాసనా, అంతకన్నా తీవ్రమైన వాంఛల వాసనా. నా తల తిరిగిపోయింది నేనెక్కడ ఉన్నానో, ఏం చేస్తున్నానో కూడా మరిచిపోయాను.

"ప్రొద్దుపోయింది. పెద్దలూ వయసు మళ్ళిన వాళ్ళంతా చల్లగా జారుకున్నారు. ఆ మైదానంలో పడుచువాళ్ళు మాత్రమే మిగిలారు

'రా కీసా త్రాగుదాం రా' అన్నది రాకుమారి. నేను రొప్పుకుంటూ వెళ్లాను. 'త్రాగు' అన్నది. కళ్ళు మూసుకుని త్రాగేశాను.

"నృత్యం చరమస్థాయి నందుకున్నది. పడుచువాళ్ళు జంటలు జంటలుగా చెట్ల గుబురుల్లోకి వెళ్ళిపోతున్నారు. ప్రక్కనున్న వాళ్ళవంక ఎవరూ తిరిగి కూడా చూడటం లేదు. చూడగలిగే స్థితిలో లేరు. నాకు వెన్నెలకూడా కీసాలాగే ఎర్రగా కనుపించింది రాకుమారి తీవెలాగా నా మీదకు వాలిపోతున్నది. నేను కూడా తడబడుతున్నాను. 'కాస్సేపు చెట్లక్రింద కూర్చుందాం, పద' అన్నది రాకుమారి. ఇద్దరం ఒకరి భుజాలమీద ఒకరు చేతులు వేసుకొని చెట్లనీడల్లోకి నడిచాం.


"నాకు మెలకువ వచ్చేటప్పటికి ఆకుల సందుల్లోంచి ఎండ ముఖంమీద పడుతున్నది. బాగా ప్రొద్దెక్కినట్లుగా ఉంది. నా రొమ్ములమీద ఎవరిదో చేయి! రాకుమారి! అప్పుడు జ్ఞాపకం వచ్చింది నాకు రాత్రి జరిగిందంతా.

"రాకుమారి సుఖంగా నిద్రపోతున్నది. నల్లని చలువరాతితో చెక్కినట్లున్న ఆమె ముఖంమీద ఎండపొడలు తళతళా మెరుస్తున్నాయి. మెల్లగా 'రాకుమారీ' అని పిలిచాను. నిద్రలో ఏదో సణిగి, ఇంకా దగ్గరగా జరిగి నిద్రపోయింది. ఆమె ముఖంమీద ఎండపొడ లాంటిదే ఒక చిన్న చిరునవ్వు మెరిసింది.

"అనర్థానికి దారితీసిన ఆ రాత్రే కిమానీ తల్లి పోయిందట. క్రియాకర్మల్లో మునిగి వున్న అతనిని నేనుగాని రాకుమారి గాని చూడలేదు. మూడు రోజులు గడచిపోయినై. రాకుమారి ఒక్క నిముషం కూడా నన్ను వదలలేదు నేనొక మహా ప్రవాహంలో ఉక్కిరిబిక్కిరి ఔతూ కొట్టుకుపోతున్నాను

"రాకుమారి తన తండ్రితో కిమానీని చేసుకోననీ, నన్నే చేసుకుంటాననీ చెప్పింది. రాజు మండిపడ్డాడు 'నేనిచ్చిన మాటసంగతి ఏమిటి? నలుగురిలో నాకు అవమానం కాదా, ఛీ ల్లేము' అన్నాడు.

'దీనికి నువ్వే కారణం' అన్నట్లు నావంక నిప్పులు కక్కుతూ చూశాడు.



"పూర్వం మీరు తిప్పికొట్టినవే ననుకొండి, ఈలోగా మీ అభిరుచి మారి ఉంటుంది అనుకున్నాను."

నేను గడగడ వణికాను. కాని రీతా ఏ మాత్రం చలించలేదు.

'ఏం ఫర్వాలేదు. నేను కిమానీతో చెప్పి ఒప్పిస్తా నన్నది. నా కేఅపాయం జరుగుతుందో నని నన్నుమాత్రం కని పెట్టుకొని ఉంటున్నది.

"కిమానీ ఇంటికి ఇద్దరం కలిసివెళ్లాం, అతని ముఖం తుఫానుముందు ఆవరించే కారుమబ్బుల్లాగ వున్నది. రీతా అతనితో స్పష్టంగా చెప్పింది, నన్నే పెళ్ళి చేసుకొంటా నని. 'ఇది ఎప్పటినుంచి?' అన్నాడు.

'అతణ్ణి చూసినప్పటినుంచీ' అంది.

"కిమానీ నావంక చూశాడు. అతని చూపుల్లో ఏముందో నేను చెప్పలేను నేను నిలువునా నీరై పోయాను. భూమి పగిలిపోయి నన్ను మింగేస్తే బాగుండు ననిపించింది.

'నీ ప్రాణాలు కాపాడాను. నిన్ను సోదరునిలా చూశాను. చివరకు నీవే నా ప్రాణాలు తీశావు' అన్నాడు.

"కిమానీ రీతాకు చాలా నచ్చచెప్పి చూశాడు. బ్రతిమిలాడాడు. చివరకు బెదిరించాడు కూడా—కాని లాభంలేకపోయింది. రీతా ససేమిరా అన్నది. చివరకు అతను నావైపు తిరిగి అన్నాడు — ఈ సమస్య

తీర్చాలంటే ఒక్కటే ఉపాయం ఉన్నది. మా ఆచారం ప్రకారం యుద్ధం చేద్దాం. గెలిచినవాడిగి రీతా' అని ఒక బల్లెం నా వైపు విసిరివేశాడు. రీతా ఒక్క కేక వేసి మా ఇద్దరిమధ్యా నిలుచున్నది. 'పిల్లేమ. నువ్వు అతణ్ని చంపేస్తావు. నువ్వు అతణ్ని చంపేస్తావు' అన్నది.

'పిరికిపందలా దాక్కుంటావేం? రా' అన్నాడు కిమానీ. నేను నబ్బుణ్నిలా అలాగే నిలబడి చూస్తూ ఉండిపోయాను. నా తప్పు ఏమీ లేదని చెప్పలేకపోయాను.

'రీతా! నువ్వు ఏమన్నా అను. నిన్ను మాత్రం నేను వదలను. నిన్నువదలి నేను బ్రతకలేను' అని కిమాని వెళ్ళిపోయాడు.

"అతను చెప్పినంతా చేశాడు రాజుతో ఏం చెప్పాడో, ఎలా చెప్పాడోగాని, వెంటనే ముహూర్తం పెట్టించాడు. నేను రాకుమారి రీతాను చూడకుండా ఆంక్ష విధించాడు. ఏదన్నా ఓడ వచ్చేవరకూ ఉండటానికి నాకో గుడిశ ఇచ్చారు. సదుపాయాలు చేశారు. అంతవరకే జనమంతా నన్ను వెలి వేసినట్టు చూడసాగారు. నాతో ఎవరూ పలకటంలేదు.

"నా జీవితంలో అంత ఒంటరితనం ఎన్నడూ అనుభవించలేదు — చివరకు, సముద్రంలో తుపానులో చావుబ్రతుకుల మధ్య ఈదులాడుతున్నప్పుడుకూడా. నా మనస్సులో ఒకవిధమైన శూన్యం ఏర్పడిపోయింది.

రాకుమారి పెళ్లి సంబరాల నృత్యాలూ కేకలూ దూరాన్నుంచి సముద్ర ఘోషలాగా వినవస్తున్నవి. ఈ నాటకంలో ముఖ్యపాత్రధారులు తప్ప అంతా హాయిగానే ఉన్నారు. రాకుమారి సుఖంగా ఉండాలి. నా స్నేహితుడు కిమానీ సుఖంగా ఉండాలి. నేను ఎంతత్వరగా ఇక్కడనుంచి నిష్క్రమిస్తే అంత మంచిది. వాళ్ళ జీవితయాత్ర, నేను ఈ దీవిమీద అడుగు పెట్టకముందు ఎక్కడ ఉందో, అక్కడినుంచే మళ్ళీ ప్రారంభమయితే బాగుండును.

"తెల్లవారు ఝామున నాకు కొద్దిగా కునుకుపట్టింది. ఎవరో లేపారు. కళ్ళు నులుముకొని చూశాను. పది పదిహేను మంది బళ్ళేలుపట్టుకొని నిలబడిఉన్నారు. వాళ్ళ నాయకుడు కాబోలు — 'రాకుమారి ఇక్కడికి వచ్చిందా' అని అడిగాడు. 'రాలేదు. ఏం జరిగింది' అని అడిగాను.

'ఏం లేదు. నిన్ను రాజుగారు పిలుస్తున్నారు. పద! పోయి దీవిఅంతా గాలించండి!' అని వాళ్ళను ఆజ్ఞాపించాడు అతను.

"ఆరోజు సాయంత్రానికిగాని, దీవి మధ్యలో ఉన్న మొసళ్ళ మడుగులో రాకుమారి శవం దొరకలేదు. తాటిలోతు ఉన్న ఆ మడుగు పసరు నీటిలో మెత్తని పట్టువంటి రాకుమారి కేశాలు నాచులాగా తేలాయి. జలగర్భంలోని చీకటిలో ఆ కళ్ళు ముత్యాల్లాగ మెరిశాయి. ఆమె శరీర పరిమళాన్ని జలచరాలు ఆనందిం



"మీరు ఏమీ అనుకోకపోతే కొంచెం ఆ పటం ఇలా అందిస్తారా?"

చాయి. నల్లగా నిగనిగ లాడే ఆమె దేహం అందమైన చేపలాగా జారిపోయింది.

"దీవిలో రకరకాల పుకారులు బయలుదేరాయి. ఆత్మహత్య అని కొంతమంది అన్నారు. 'కిమానీయే చంపి మగుడులో పడేశా' డని మరికొంతమంది అన్నారు. వాళ్ళ పుణ్యమా అని నన్నెవరూ ఏమీ అనలేదు. ఆ రోజునుంచి కిమానీ కూడా మాయమయ్యాడు. రాజు అతనిని చంపించివేశా డని కొంతమంది, రాజు భయంతో అతనే పారిపోయి, దీవికో చివర ఉన్న దట్టమైన అరణ్యంలో దాక్కొన్నా డని మరికొంత మందీ అనుకోసాగారు. అసలు జరిగిన దేమిటో ఎవరికీ తెలియలేదు. ఆ దీవిమీద ఉన్న ఒక్కొక్క క్షణం నాకు ఒక్కొక్క యుగంలాగా గడవసాగింది. రీతా కిమానీలు వదిలివెళ్ళిన నీడలాగా ప్రేతంలాగా అలా తిరుగుతూ ఉండేవాడిని. దట్టమైన అడవిలో ఒంటరిగా పిచ్చివాడిలా తిరిగేవాడిని. ఒక్కొక్కసారి రాత్రిళ్ళు కూడా అడవిలోనే గడిపివేసేవాడిని. రీతా మొసళ్ళ మడుగులో కలసిపోయింది. కిమానీ గాలిలో మాయమైపోయాడు. వాళ్ళిద్దరే ఎందుకు చనిపోవాలి? నేనెందుకు చావలేదు?

"ఒక రోజున అలాగే తిరుగుతూ ఉంటే నా వెనుక పొదలో ఏదో అలికిడి అయింది. ఏదన్నా మృగమేమో నని

తిరిగి చూశాను. అయినా ఈ అడివిలో మృగాలు లేవే! కాదు. అతడు కిమానీ.

"నేను నిర్ఘాంతిపోయి చూస్తూ నిలుచున్నాను. అతను పిచ్చివాడిలా భయంకరంగా ఉన్నాడు. ముఖంనిండా వంటినిండా దుమ్ము. గడ్డం పెరిగింది. జుట్టు రేగింది. కళ్ళు చింత నిప్పుల్లా ఉన్నాయి. అతని చేతిలో ఒకబల్లెం ఉన్నది.

'నీవా!' అన్నాడు. ఆ స్వరంలో కోపం, స్నేహం, ద్వేషం, ఆప్యాయతా ఏమీలేవు. ఆశ్చర్యం కూడా లేదు. ఒక రకమైన నిర్వేదం ఉన్నది. 'భయపడకు. నిన్ను చంపనులే.'

'కిమానీ! నేస్తం? నీవు ఒకరోజున నాకు ప్రాణ మిచ్చావు. ఇవాళ తీసుకున్నా చింతించను. కాని ఒక ప్రశ్నకు జవాబు చెప్పు. రీతాను నీవే చంపావా?'

"కిమానీ వెంటనే జవా బివ్వలేదు - కొంత సేపు అలా నా ముఖంవంక చూస్తూ నిలుచున్నాడు. చివరకు నిశ్చలమైన స్వరంతో 'రేటు నేను చంపలేదు. తానే చనిపోయింది.' అన్నాడు.

'ఎందుకు? ఏం జరిగింది? నువ్వు ఏం చేశావు?'

'ఏమీ చెయ్యలేదు. మొగుడు పెళ్లాన్ని ఏం చేస్తాడో అ దే చే శా ను. నువ్వేం చేశావో, అదే చేశాను.'

'మరి, మరి...'

"మాకది క్రొత్తకూడాకాదు. పెళ్ళి కాకపోయినా ఇక్కడది తప్పులేదు. కాని ఎందువల్లనో అయిష్టత చూపింది. నేను బలవంతం చేశాను. నిద్రపోయి లేచి చూసేసరికి లేదు' ఎక్కడో నూతిలోంచి వస్తున్నట్టుగా ఉంది కిమానీ కంఠం.

'నీ ప్రశ్నకు జవాబిచ్చాను. నేను కూడా ఒక ప్రశ్న అడుగుతాను. జవాబిస్తావా?' అన్నాడు.

'అడుగు.'

'ఈ దీవిలో నన్ను మించిన బలశాలీ, ఎరుడు లేడు. తెప్పను నడపటంలో, చేపలు పట్టటంలో, వేటాడటంలో నాకెవరూ సాటిరారు. ఆడపిల్లలంతా నేనంటే పడిచస్తారు. నువ్వు రానంతవరకూ రీతాకూడా అంతే. నీవు రీతాను ఏం చేసావు? ఏం మాయచేశావు? ఏం మత్తు మందు చల్లావు? చెప్పు! నేను నిన్నేమీ అనను-చెప్పు!'

'నే నేం చేయలేదు. కిమానీ నేస్తం! నా మాట నమ్ము. జరిగినదానికి నన్ను నేను ద్వేషించని రోజు లేదు. నేను అధముణ్ని-అయినా అంత అధముణ్ని కాదు. ముంచుకొస్తున్న ప్రళయానికి దూరంగా ఉందామని ఎంతో ప్రయత్నించాను కాని లాభంలేకపోయింది. నన్ను క్షమించు. నీవు క్షమిస్తేగాని భగవంతుడు నన్ను క్షమించడు.'

'మరి మరి...రీతాకు నీమీద అంత ఇష్టం ఎందుకు కలిగింది? నా మీద అయిష్టం ఎందుకు కలిగింది?'

'నేస్తం! స్త్రీ హృదయంలో రహ-

స్యాలు భగవంతుడుకూడా కనుక్కోలేడు. కాని నేను ఒకటి అనుకుంటున్నాను. మా భాషలో 'క్రొత్త ఒక వింత అనీ, పాత ఒక రోత' అనీ అంటారు దానినే మరో విధంగా 'పొరుగింటి పుల్లకూర రుచి' అని అంటారు. మనిషి ఎన్నడూ ఉన్నదానితో తృప్తిపడడు. అందని ద్రాక్షపండ్లకొరకు అర్రులు చాచటం మనుషులకు అలవాటు. లేకపోతే ప్రపంచంలో ఇన్నిబాధలు ఉండవు. వస్తాను మిత్రమా! సెలవు! నన్నుగురించి చెడుగా అనుకోకు. క్షమించు' అని తలవంచుకొని వెళ్ళిపోయాను. కిమోనీ నావంకే చూస్తూ అలాగే నిలబడిపోయాడు.

"ఆ తరువాత కొద్ది రోజులకే ఆ దీవికి ఒక ఓడ వచ్చింది దానిలోఎక్కి ఎలాగో అష్టకష్టాలుపడి, నేను స్వదేశానికి చేరుకున్నాను."

అని చెప్పి కథ ముగించి తాతయ్య ఒకసారి ఉమ్మేసి, ఆరిపోయిన చుట్టపీక పారేశాడు. కుర్రవాళ్ళు ఒక్కసారి ఊపిరి పీల్చారు.

"ఈ కథ నిజంగా జరిగిందేనా తాతయ్యా!"

"నువ్వెప్పుడన్నా ఓడల కంపెనీలో పనిచేశావా తాతయ్యా!"

"అయినా సరదాగా ఏదో కథ చెప్పమంటే ఇట్లాంటి ఏడుపు కథలు చెబుతావేం."

"అదుగో, అదే వద్దన్నాను. కథ చెప్పమని ప్రాణాలు తీసి, కథ అయిపోగానే నానామాటలు అంటారా, ఏరు దాటి తెప్పతగలేసినట్లు!" అన్నాడు తాతయ్య.

"ఒరే, తాతయ్య ఇప్పుడంటే ఇలా ఉన్నాడుగాని, ఈడులో ఉన్నప్పుడు గొప్ప హీరోలేరా! దేశదేశాల స్త్రీలను ప్రేమించాడు" అన్నాడు రాముడు. వాడీ విషయం మీద అథారిటీ ఆయె!

"అరె, అసలుసంగతి నేను చెబుతా వినండిరా! మొన్న మంగళవారంనాడు తాతయ్య స్వంతపనిమీద గుంటూరు వెళ్ళాడు. అక్కడ లీలామహలులో 'మ్యూటినీ ఆన్ ది బౌంటీ' చూసివచ్చాడు. అదే కాస్త ఉప్పుకారం కలిపి మనకు చెప్పాడురా!" అన్నాడు శంకరాయి.

"ఛా ఛా! వెధవల్లారా! మీకు కథలు చెప్పటం నాదే బుద్ధితక్కువ" అని తాతయ్యదులబరించుకుని లేచిపొయ్యాడు.

